ప్రజాశక్తి
మంగళవారం 29 ఆగస్టు 2023
5
అల్లూరి సీతారామరాజు

చీరల పంపిణీ

ప్రజాశక్తి-అరకులోయ: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైసిపి నాయకులు సుంకరమెట్ట పంచాయతీ కేంద్రంలో బిడ్డగూడ గ్రామంలో కేక్ కట్ చేసి వృద్ధులకు స్వీట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ జిల్లా అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, మాజీ సర్పంచ్ పాంగి చిన్నారావ్, మాజీ ఎంపీటీసీ సమర్ధి భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగింది. మండల పార్టీ అధ్యక్షుడు కొర్రగాసి, మాజీ సర్పంచ్ గుడివాడ ప్రకాష్ రావు, మాజీ ఎంపీటీసీ బీబీ సుందర్రావు, మాజీ సర్పంచులు గొల్లూరి ప్రసాద్ రావు మొస్య, హరి బారికి అప్పలరాజు, మాజీ ఎంపీటీసీ రామ్ రామదాస్, వైసిపి నాయకులు పట్టాసి కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

చీరలు ఇస్తున్న నాయకులు

విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో మరో పోరాటం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సురేంద్ర - అమరులకు ఘన నివాళి

ప్రజాశక్తి-అరకులోయరూరల్: విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో మరో పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సురేంద్ర పిలుపునిచ్చారు. సోమవారం ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో విద్యుత్ అమరవీరుల చిత్రపటాలను పూల మాలలు వేసి ఘనంగా

నివాళ్లర్పిస్తున్న సురేంద్ర, ఉమామహేశ్వరరావు తదితరులు

నివాలర్పించారు. ఈ సందర్భంగా సురేంద్ర, అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, బసిర్బాగ్ లో నిర్వహించిన విద్యుత్ పోరాటంలో పోలీసు కాల్పుల్లో రామకృష్ణ, రామస్వామి ప్రాణాలు విడిచారన్నారు. గిరిజనులకు వంద శాతం ఉద్యోగాలు కల్పించే జీఓ 3 పునరుద్ధరణ చేయాలని చెప్పారు. నిరుద్యోగం, అధిక ధరలకు వ్యతిరేకంగా ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 4 వరకు జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం నిరుగ్యోగ సమస్య పరిష్కారం, ధరలు అదుపు చేయడంలో ఘోరంగా విఫలం చెందిందని విమర్శించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేద ప్రజలపై భారాలు మోపుతున్నాయన్నారు. సెప్టెంబర్ 4 వరకు జరిగే పోరాటంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కె.మగ్గన్న, కెజగన్నాధం పాల్గొన్నారు.

పాడేరు: ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీల బాదుడిపై ప్రజలు పోరాటానికి సిద్ధం కావాలని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ ప్రజలకు పిలుపునిచ్చారు. చింతపల్లి మండల కేంద్రంలో

నివాళి అర్పిస్తున్న చిన్నయ్యపడాల్, గిరిజనులు

విద్యుత్ అమరవీరులకు సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం మహిళలు కార్మికులు ఘనంగా నివాళులర్పించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై మరో భారీ దోపిడీకి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని, దీనిపై ప్రజలు తిరుగుబాటుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పంకి ధనంజయ్, సిఐటియు, అంగన్వాడి కార్యకర్తలు పెంటమ్మ, రాజేశ్వరి, సత్యవతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

ట్రైయినీ ఐఎఎస్‌లతో కలెక్టర్

గిరిజన ప్రాంతాల్లో విధులు సవాలు

- ట్రైనీ ఐఎఎస్ బృందానికి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఉపదేశం

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన ప్రాంతాలలో అనేక సమస్యలు, సవాళ్లు ఉంటాయని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. ఆంధ్రప్రదేశ్ లో సుమారు 42 లక్షల మంది గిరిజనులు జీవిస్తున్నారని చెప్పారు. గ్రామ సందర్శన పర్యటనలో భాగంగా పాడేరు డివిజన్లో పర్యటిస్తున్న 2023 బ్యాచ్‌కు చెందిన ట్రైనీ ఐఎఎస్ అధికారులతో సోమవారం ఐటిడిఏ కార్యాలయంలో సమావేశ మయ్యారు. గిరిజన ప్రాంతంలో పర్యటనకు ఎందుకు ఎంచుకున్నారని, మొదటి సారిగా ఏజెన్సీలో పర్యటిస్తున్నారా ? అని అడిగి తెలుసుకున్నారు. ఐటిడిఏ పరిధిలో సింగిల్ అడ్మినిస్ట్రేషన్ అమలవుతుందన్నారు. 2022 లో ప్రభుత్వం అల్లూరి సీతారామ రాజు జిల్లాను ఏర్పాటు చేసిందన్నారు. ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ మాట్లాడుతూ, జిల్లాలో గ్రామాలను సందర్శించడంతో పరిపాలన సులభతరమౌ తుందన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలు అమలవుతున్న పథకాలపై అవగాహన కల్పించుకోవాలని చెప్పారు. అటవీ హక్కుపత్రాల పంపిణీ, మిషన్ కనెక్ట్ పాడేరు, కాఫీ ప్రాజెక్టు అమలు, రహదారుల నిర్మాణాలు, వైద్య ఆరోగ్య సేవలు, విద్యా సదుపాయాలు, వెలుగు, గిరిజన సంక్షేమ శాఖ (ఇంజనీరింగ్) తదితర వాటిపై వివరించారు. పాడేరు ఐటిడిఏ పరిధిలో పర్యటిస్తున్న 14 మంది ట్రైనీ ఐఎఎస్ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి అధ్యయనం చేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో ట్రైనీ ఐఎఎస్ అధికారులు, డిఎఫ్ఓ వినోద్ కుమార్, ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్. ప్రభాకరరావు, ఎం.వేంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇ ఇ డి. వి. ఆర్. ఎం. రాజు, డిఆర్ డిఏ పిడి వి, మురళి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా, జమాల్ భాషా, ఐటిడి ఏ పరిపాలనాధికారి ఎం. హేమలత, ఉపాధి హామీ ఎపిడి, జె. గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సమరం

-30 నుంచి జిల్లాలో సిపిఎం సమరభేరి
-విద్యుత్ భారాలు, ధరలు, నిరుద్యోగంపై ఆందోళనలు
- పాల్గొనాలని ప్రజలకు నేతల పిలుపు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 30 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా సిపిఎం నిరసన కార్యక్రమాలు చేపట్టనుంది. సిపిఎం కేంద్ర కమిటీ పిలుపుమేరకు అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ భారాలతో ప్రజలను దోచుకు తింటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సమరభేరి పేరుతో ఆ పార్టీ నాయకులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఆగస్టు 30, 31 తేదీల్లో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ, 1, 2 తేదీల్లో గ్రామ, వార్డు సచివాలయంలో విజ్ఞాపనలు అందజేయడం, 3వ తేదీన నిరుద్యోగ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశాలు, 4వ తేదీన మండల కార్యాలయాల ఎదుట ధర్నాలు పార్టీ నాయకులు నిర్వహించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్యులు అల్లాడుతున్నారు. బిజెపి, వైసిపి పాలనలో నిత్యవసర వస్తువులు, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. దేశంలో, రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. రాష్ట్రంలో ఇసుక సమస్యల వల్ల భవన నిర్మాణ కార్మికులకు నెలకు 20 రోజులు కూడా పని దొరకడం కష్టంగా మారింది.

మోడీ విధానాలే రాష్ట్రంలో అమలు

మోడీ అనుసరిస్తున్న విధానాలను రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అత్యంత ఉత్సాహంగా అమలు చేస్తోంది. బిజెపి పాలనలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలే తమ ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం బిజెపి విధానాలను శరవేగంగా అమలు చేయడంలో ముందుంది. కేంద్రం పెట్టిన షరతులకు రాష్ట్ర ప్రభుత్వం లొంగి ప్రజలకు విద్యుత్ భారాలను మోపుతోంది. మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని జగన్ ప్రభుత్వం అత్యంత ఉత్సాహంగా అమలు చేస్తోంది. రాష్ట్ర హక్కులపై దాడి జరుగుతున్న వైసిపి నిసిగ్గుగా బిజెపికి మద్దతు పలుకుతోంది. రాజధానికి, పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకపోయినా కేంద్రంలో బిజెపికి వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మద్దతు పలుకుతూ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోంది. పేదలకు, పెత్తందారులకు యుద్ధం జరుగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ అంటూనే దేశంలో అత్యంత పెద్దందారులైన ఆదాని, అంబానికి మద్దతిస్తున్న మోడీ బాటలో జగన్ ప్రభుత్వం కూడా పయనిస్తోంది. నాలుగేళ్లుగా ఇసుక విధానం గందరగోళంగా మార్చేసి నిర్మాణ రంగాన్ని దెబ్బ కొట్టారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, ప్రత్యేక హోదా ఇవ్వకపోయినా మోడీని మద్దతు పలకడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమే. పన్నుల భారం మోపడంలో మోడీ, జగన్ పోటీ పడుతూ పరిపాలిస్తున్నారు. బిజెపి విధానాలను శరవేగంగా అమలు చేయడంలో వైసిపి ముందుంది.

జిఒ-3 కు చట్టబద్ధత కల్పించాలి...
ఆదివాసి స్పెషల్ డిఎస్ సి నోటిఫికేషన్ ఇవ్వాలి

షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసి గిరిజనులకు వంద శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ గతంలో టిడిపి ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలకు సంబంధించి కీలకమైన జిఒ-3ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగాలకు కీలకమైన, గిరిజనుల ఉద్యోగాలకు అండగా ఉన్న జిఒ-3 రద్దుతో గిరిజనుల మనుగడకే ప్రమాదం ఏర్పడింది. ఉపాధ్యాయ ఉద్యోగాలను గిరిజనులు కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చింది. జిఒ-3 రద్దు రివ్యూ పిటిషన్ విచారణ దశలో ఉండగా వైసిపి ప్రభుత్వం అడ్డగోలుగా ఆయా ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగాలను గిరిజనేతరులతో భర్తీ చేస్తుండడంతో స్థానిక ఆదివాసీలు ఉద్యోగాలను కోల్పోతున్నారు. సంవత్సరాలుగా ఆదివాసి నిరుద్యోగులు ఉద్యోగం కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. చదువుకున్న ఆదివాసి నిరుద్యోగులు ఎంతోమంది వయోపరిమితి భారంతో ఉద్యోగాలకు దూరమవుతున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక కుటుంబాలను పోషించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బిఇడి, డైట్ వంటి ఉద్యోగ శిక్షణలు పొంది ఆదివాసి స్పెషల్ డిఎస్ సి నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. ఆదివాసి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలి.

బిజెపి, వైసిపి ఒక్కటే..

బిజెపి, వైసిపి రెండు పార్టీలు ఒక్కటే.. ప్రజలను మోసం చేయడంలో ప్రజలను పక్కదారి పట్టించడంలో ఇద్దరు దొంగలే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో విద్యుత్తు చార్జీలు, నిత్యావసర ధరలు భారీగా పెరిగాయి. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తూ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రబతుత్వాల విధానాలకు వ్యతిరేకంగా అందరూ పోరాడాలి. పోరాటానికి తరలిరావాలి.

పి.అప్పలనర్స,
సిపిఎం జిల్లా కార్యదర్శి

విఆర్ఒపై విచారణ చేపట్టాలి

సిపిఎం నేతల డిమాండ్

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని అరకు సంత బయలు గ్రామంలో గిరిజనేతరులకు భూమి పట్టాల కోసం మ్యూటేషన్లు ఇచ్చిన ఆ పంచాయతీ విఆర్ఓ పై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని స్థానిక సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, కోర్టు పరిధిలోనున్న హెల్డోవర్ భూములను పట్టాలు చేయించేందుకుగాను గిరిజనేతరులకు వీఆర్వో మ్యూటేషన్లు ఇస్తున్నారు. 1/70 చట్టం ప్రకారం ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులకు భూములు కొనడానికి, విక్రయించడానికి ఎటువంటి హక్కు లేదన్నారు. చట్టాలను కాపాడాల్సిన విఆర్వో చట్టాలను ధిక్కరించి మ్యూటేషన్లు ఇవ్వడం సరికాదన్నారు. తక్షణమే ఈ విషయంపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ నిర్వహించి వాస్తవాలు రుజువైతే వెంటనే విఆర్ఓ పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

విద్యా దీవెన నగదు జమ

- తల్లుల ఖాతాలో రూ.6,70 కోట్లు
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు

జిల్లాలో 13,578 మంది విద్యార్థులకు రూ. 6.70 కోట్లు విద్యాదీవెన పథకం కింద లబ్ది చేకూరిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. రాష్ర ముఖ్య మంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్తూరు జిల్లా నగరి నుండి ప్రారంభించిన 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జగనన్న విద్యా దీవెన నగదు జమ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని సోమవారం కలెక్టరేట్ నుండి వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 11,477 మంది గిరిజన విద్యార్థులకు రూ. 5కోట్ల 37 లక్షల 50,761లు, 319 మంది ఎస్సీ విద్యార్ధులకు రూ.21 లక్షల 57 వేలు, మందికి బిసి, ఈ బిసి,కాపు విద్యార్ధులకు రూ. 1కోటి 6లక్షల 64 వేలు, 53 మంది క్రిష్టయన్,ముస్లిం మైనారిటీలకు రూ.4 లక్షల 31 వేలు 267లను లబ్దిదారుల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందని పేర్కొన్నారు. జగనన్న విద్యా దీవెనను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాడేరు శాసన సభ్యురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. విద్యా దీవెనను విద్యార్ధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గిరిజన విద్యార్ధులు ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాలను సక్రమంగా వినియోగించుకుని ఉన్నత విద్యను అభ్యసించాలని చెప్పారు. అనంతరం నమూనా చెక్కును లబ్దిదారులకు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండల రావు, ఎస్టీ కమిషన్ సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎటిడబ్ల్యూఓ ఎల్.రజని, ఎంపిటిసి గిడ్డి విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎఎస్ఐ ప్రకాష్ మృతి

నివాళులర్పించిన సిఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బంది

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని జడ్డంగి పోలీస్ స్టేషన్ ఎఎస్ఐగా పనిచేస్తున్న బివిఎస్ ప్రకాష్ ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో రాజవొమ్మంగి సిఐ షేక్ బాజీలాల్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది సోమవారం ఘన నివాళులర్పించారు. ప్రకాష్ శనివారం జడ్డంగిలో తన విధులు ముగించుకొని స్వగ్రామం రాజమహేంద్రవరం వెళ్లారు. ప్రకాష్‌కు ఆదివారం రాత్రి తన ఇంటివద్ద గుండెపోటు రావడంతో కుటుంబీకులు ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాజమహేంద్రవరంలో ఏఎస్ఐ ప్రకాష్ అంత్యక్రియలు పోలీస్ లాంచనాలతో నిర్వహించారు. స్థానిక సిఐ షేక్ బాజీలాల్, జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు, రైటర్ కిషోర్, సిబ్బంది గంగాధర్, సురేష్, మారేడుమిల్లి పోలీస్ సిబ్బంది, ఏపీఎస్పీ సిబ్బంది ప్రకాష్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సీఐ బాజీలాల్, ఎస్ఐ రఘునాథరావు ఆధ్వర్యంలో ప్రకాష్ కుటుంబ సభ్యులకు దహన సంస్కారాల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు.

సిపిఎం సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- విఆర్.పురం

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం ఆధ్వర్యాన సమరభేరి కార్యక్రమాలు చేపడుతున్నట్లు సిపిఎం నాయకులు తెలిపారు. స్థానిక రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో సమరభేరి వాల్ పోస్టర్లను సోమవారం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, ఎంపీపీ కారం లక్ష్మి, పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనలో వలన నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకుండా నిర్వాసితులకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. ఏజెన్సీ మండలాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రం బాటలోనే రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం నడుస్తోందని, ప్రజలను మోసం చేస్తూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తుందని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, రు.400కే వంట గ్యాస్ ఇవాలని, సంవత్సరానికి మూడు సిలెండర్లు ఉచితంగా ఇవ్వాలని, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని,

సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం నాయకులు

పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించాలని, ధరలు నియంత్రణ నిధి ఏర్పాటు చేయాలని, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా కందిపప్పు సరఫరా పునరుద్ధరించాలని, ఖాళీగా ఉన్న గ్రూప్ 1, గ్రూప్ 2 పోస్టులను భర్తీ చేయాలని, గిరిజన యువతకు స్పెషల్ డిఎస్సీ నిర్వహించాలని, ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని తదితర డిమాండ్లతో సిపిఎం ఆధ్వర్యాన సమర భేరి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఈ నెల 30, 31 తేదీల్లో సంతకాల సేకరణ, సెప్టెంబర్ 3న సచివాలయాల్లో అర్జీలు, సెప్టెంబర్ 4న మండల కేంద్రంలో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పోడియం శ్రీరామ్మూర్తి, కారం సుందరయ్య, ఖాదర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఇసుక దోపిడీపై టిడిపి సత్యాగ్రహం

ప్రజాశక్తి-దేవరాపల్లి : వైసిపి ఇసుక దోపిడీకి వ్యతిరేకంగా టిడిపి అధిష్టానం పిలుపు మేరకు మండలంలోని కలిగొట్ల శారదా నది వంతెన సమీపంలోని ఇసుక రీచ్ వద్ద సోమవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇసుక సత్యాగ్రహం కార్యక్రమం చేపట్టారు. వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. టిడిపి మాడుగుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి.కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఇసుకను తన ఆధీనంలో పెట్టుకొని అడ్డగోలుగా దోచుకుంటున్నారని ఆరోపించారు. వైసిపి ఇసుక దోపిడీని అధికారి యంత్రాంగం ఆపలేకపోతే, టిడిపి కార్యకర్తలు అక్రమ ఇసుక రవాణాను అడ్డుకుంటారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు గవిరెడ్డి రామానాయుడు, కోళ్ల లలితా కుమారి, గిడ్డి ఈశ్వరి, పల్లా శ్రీనివాసరావు, టిడిపి నాయకులు బుద్ధ నాగజగదీష్, కోరాడ రాజబాబు, బత్తుల తాతయ్య బాబు, పైలా ప్రసాదరావు, కృష్ణ యాదవ్, సత్యవతి పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

స్పందనకు 51 అర్జీలు

ప్రజాశక్తి-రంపచోడవరం

స్థానిక ఐటిడిఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 51 అర్జీలు అందాయి. వీటిని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటిడిఏ ఎపిఒ జనరల్ సిహెచ్.శ్రీనివాసరావు స్వీకరించారు. అడ్డతీగల మండలంలోని డి.రామవరం గ్రామంలో ఆశ వర్కర్‌ను నియమించాలని, చింతలపూడి పంచాయతీ పరిధిలోని బొడ్డగుంట, చింతకొయ్య గ్రామాల మధ్యలో కాలువపై వంతెన నిర్మించాలని, చింతలపూడి సచివాలయంలో మూడు నెలల నుండి ఫైబర్ నెట్ పనిచేయడం లేదని, వెంటనే మరమ్మతులు చేయించాలని, ఏజెన్సీలోని కొండరెడ్ల అభివృద్ధికి ప్రత్యేక సర్వే నిర్వహించాలని వినతిపత్రాలు అందాయి.

మారేడుమిల్లి గ్రామంలో ఏకలవ్య మోడల్ స్కూల్లో రన్నింగ్ వాటర్ లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రెండు బోర్లు ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు సరిపడా తరగతి గదులు ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు మెనూ పక్కాగా అమలు చేయాలని దరఖాస్తు సమర్పించారు. 1950, 1956, 1976 సంవత్సరాలలో గిరిజన తెగలుగా గుర్తింపు పొందిన ఏజెన్సీలోని ఏడు గిరిజన తెగల వారికి జనన మరణాల రిజిస్టర్లు పరిశీలించి జీవో నెంబర్ 58 ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్ రాజ్, డిఎస్.శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజ్, ఎండి యూసఫ్, సుబ్బయ్య, పిహెచ్ఓ కె.చిట్టిబాబు, ఎడిఎలు కెసిహెచ్‌వి చౌదరి, కె.సావిత్రి, పిఎఓ రాంబాబు, ఎడిఎంహెచ్ఒ జి.భాస్కర్, సీనియర్ మేనేజర్ ముర్ల నాగ వెంకట రాజారెడ్డి, డిఎల్‌పిఓ రాఘవన్, సిడిపిఓ సంధ్యారాణి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

వరద బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న ఎఎస్‌డిఎస్ సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి-విఆర్.పురం

ఎఎస్‌డిఎస్ సంస్థ సహాయ సహకారాలతో విఆర్.పురం మండలంలోని వరద బాధితులు 648 కుటుంబాలకు సోమవారం నిత్యావసర సరుకులు, దోమతెరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో 236 కుటుంబాలకు, జీడిగుప్పలో 113, చిన్నమట్టపల్లి పంచాయతీ పరిధి ప్రత్తిపాకలో 104, కన్నాయిగూడెంలో 54 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, కోటరిగొమ్ము గ్రామంలో 50 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, దోమతెరలు అందజేశారు. ఈ సందర్భంగా ఎఎస్‌డిఎస్ సంస్థ అధినేత వి.గాంధీబాబు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలలో ఎప్పుడూ కూడా ఇక్కడి ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ సంవత్సరం గోదావరి, శబరి నదుల వరదల కారణంగా ఇళ్లు మునిగిన వారికి డ్రై రేషన్ కిట్స్ అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ రాజ్‌కుమార్, కో-ఆర్డినేటర్ టిఎస్ఎస్.సుబ్రహ్మణ్యం, సిబ్బంది రవి, కుమారి, నాగమణి, జ్యోతి, సౌజన్య, పూజిత, హరి పాల్గొన్నారు.

రాజ్మా విత్తనాల పంపిణీ

పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - జి.మాడుగుల: మండలంలో వంతాల పంచాయతీలోని పలు గ్రామాల రైతులకు సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద సబ్సిడీపై రాజ్మా విత్తనాలను, ఎరువులను స్థానిక సర్పంచ్ పద్మ, వైసిపి ఎగ్జిక్యూటివ్ మెంబర్ కళ్యాణ్ చేతుల మీదుగా రైతులకు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల కన్వీనర్లు, వైసిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: రాజ్ మా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని గసభ పంచాయితీ సిపిఎం సర్పంచ్ పి.సునీత కోరారు. మండలంలోని గసభ పంచాయితీ సచివాలయంలో సర్పంచ్ పి.సునీత ఆధ్వర్యంలో రాజ్మా విత్తనాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకుని తమ పంటలు పండించి ఆర్థికంగా ఎదగాలని చెప్పారు. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా మంజూరు చేసిన విత్తనాలు దుర్వినియోగం చేయవద్దని కోరారు. చట్టవ్యతిరేకమైన పంటలైన గంజాయి వంటి జోలికి పోకుండా ఉండాలని, నాటుసారా వంటి మత్తు పదార్థాలు తయారు చేయడం నేరమని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంపిటిసి ఎం.జెమ్మ,మాజీ సర్పంచ్ పి.సురేష్ కుమార్, ఉప సర్పంచ్ కే మహదేవ్, వార్డుమెంబర్లు పి.సత్యనారాయణ, కె.క్రిష్ణ, జి.మోహన్ దాస్, అగ్రికల్చర్ అసిస్టెంట్ పి.బలరాం, డిజిటల్ అసిస్టెంట్ పి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల మరమ్మతుకు నిధులు ఇవ్వండి

ఐటిడిఎ పిఒకు భీముడువలస గ్రామస్తులు, వైస్ సర్పంచ్ వినతి

పీవోకు వినతి పత్రం ఇస్తున్న వైస్ సర్పంచ్, గ్రామస్తులు

ప్రజాశక్తి-పాడేరు: అరకులోయ మండలం పద్మాపురం పంచాయతీ భీముడు వలస గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఈ గ్రామ ఉపసర్పంచ్ భగత్‌రాం,గ్రామస్తులు సోమవారం పాడేరులో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి అభిషేకం కలిసి వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాఠశాల భవనం పూర్తిగా శిథిలమయ్యిందని, విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నారని ప్రాజెక్ట్ అధికారికి వివరించారు. పాఠశాల భవనం తక్షణమే మరమ్మతులు చేయవలసి ఉందని వెంటనే పరిశీలించి చేపట్టేందుకు ఇంజనీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు ఇవ్వాలని పిఓను కోరారు. దీనిపై ప్రాజెక్టు అధికారి అభిషేక్ సానుకూలంగా స్పందించి నిధులు మంజూరుకు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ , గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: భూముల రీ సర్వే కోసం రైతులు రెవిన్యూ కార్యాలయాలకు రాకూడదని, రీ సర్వేలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. జిల్లాలోని రెవెన్యూ, సర్వే అధికారులు, సబ్ కలెక్టర్లతో జగనన్న భూ హక్కు భూ రక్ష భూముల రీ సర్వే పురోగతిపై సోమవారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,. 237 గ్రామాల్లో 13 నోటిఫికేషన్ (సర్వే రికార్డులు తయారు) పూర్తి చేసారని చెప్పారు. 954 గ్రామాల్లో భూముల రీసర్వే జరిగిందని, ఇంకా 12 వందల గ్రామాల్లో రీసర్వే చేయవలసి ఉందన్నారు. ప్రభుత్వం రీసర్వేకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రోజు సర్వేకు కొంత సమయం కేటాయించాలని తహశీల్దార్లకు సూచించారు. వై.రామవరం తహశీల్దార్ ఉదయం 11 గంటల వరకు వీసికి హాజరు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. ముసాయిదా భూమి రికార్డులు తయారు . చేసిన తరువాత ఇరువై నాలుగు గంటల్లో ఫారం- 3 జారీ చేయాలని స్పష్టం చేసారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.శివ శ్రీనివాసు, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం భన్సల్, పాడేరు ఇన్చార్జి సబ్ కలెక్టర్ ఐటిడి ఏపీఓ, వి.అభిషేక్, డిఆర్ఓ పి. అంబేద్కర్, సర్వే సహాయ సంచాలకులు వై. మోహనరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్మికుల ధర్నా

అరకులోయలో ధర్నా చేపడుతున్న కార్మికులు

ప్రజాశక్తి- అరకులోయ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అరకులోయ మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అల్లూరి జిల్లా కమిటీ పిలుపు మేరకు పంచాయతీ పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, టెండర్ పద్ధతి రద్దు చేయాలని, కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.ప్రతినెల 1న జీతాలు చెల్లించాలన్నారు. ఈఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్మికులకు గత మూడు సంవత్సరాల నుండి యూనిఫార్మ్, బూట్లు, ఇతర సేఫ్టీ మెటీరియల్స్ ఇవ్వలేదని, ప్రతి సచివాలయంలో గ్రీన్ అంబాసిడర్ పేరుతో కార్మికులు పని చేస్తున్నారని వీరికి 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి జీతాలు చెల్లించాలని ఆదేశాలు ఉన్నా పట్టించుకోలేదని కార్మికులు తెలిపారు. తక్షణం పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని, లేకుంటే చలో విజయవాడకు వెళ్లడానికి వెనకడుగు వేసేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏపీ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మండల నేత వెంకటరావు, బుద్ధు, భగవాన్, కుమారి పాల్గొన్నారు.

పెదబయలు: పారిశుధ్య కార్మికుల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని సోమవారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బోండా సన్నిబాబు డిమాండ్ చేశారు. ఎంపీడీఓ ఎల్.పూర్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. మండల పరిషత్ కార్యాలయం ముందు పారిశుధ్యం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సన్నిబాబు మాట్లాడుతూ, కార్మికులు చాలీ చాలని వేతనాలు పొందుతూ కుటుంబాలతో జీవనం గడుపుతున్నారని తెలిపారు. కార్మికులకు వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. సేఫ్టీ మెటీరియల్ ఇవ్వాలన్నారు. చనిపోయిన కార్మికుల కుటుం బాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మాజీ నాయకుడు కె.శరబన్న బోండా గంగాధరం, సీతాగుంట వైస్ సర్పంచ్ సిద్దేశ్వర్‌రావు, బొంజుబాబు, గోవిందు, సురేష్, బుజ్జి పాల్గొన్నారు

అనంతగిరి:పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపిడిఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్మికుల బకాయి వేతనాలు తక్షణమే చెలించాలని పలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియూ మండల కార్యదర్శి, టోకురు సీపీఎం సర్పంచ్ కిల్లో. మోస్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని విమర్శించారు. ఇన్‌చార్జి ఎంపిడిఓ కుమార్‌కు విన్నంచారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు చిన్న సిమన్న, ఎమ కె.చిన్న . రవి, చిన్నబాబు, సిపిఎం మండల కార్యదర్శి సోమెల .నాగులు, గిరిజన సంఘం మండల అధ్యక్షులు సీవేరి. కొండలరావు పాల్గొన్నారు

అనంతగిరి, పెదబయలులో ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు

రాకపోకలకు గిరిజనం అవస్థలు

వర్షాలకు కూరుకుపోతున్న వాహనాలు

వాహనాన్ని లాగుతున్న గిరిజనులు

ప్రజాశక్తి- జిమాడుగుల మండలంలో గల మారుమూల పంచాయతీ అయిన కిల్లం కోట గ్రామానికి చేరాలంటే సాహసం చేయాల్సిందే అని చెప్పక తప్పదు కిల్లం కోట గ్రామానికి వెళ్లే రహదారి మధ్యలో కోడి మామిడి గ్రామ సమీపంలో కొండగడ్డ ఉంది కొద్దిపాటి వర్షాలు పడినా చాలు పొంగిపొర్లుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు గెడ్డ ఉప్పొంగి పారుతుంది. వర్షం కురిస్తే ఆ లోపల ఉన్న సుమారు 30 గ్రామాలకు రాకపోకలు బందే అని చెప్పుకోవచ్చు. గేడ్డ పొంగి పారడంతో సోమవారం తమ గ్రామాలకు గిరిజనులు చేరాలని సుమారు పదిమంది సహాయంతో ద్విచక్ర వాహనాన్ని గెడ్డ దాటిస్తున్నారు వర్షం కురిసిన ప్రతిసారి ఇలా సాహసం చేయాల్సిందే. గెడ్డ దాటే క్రమంలో పలువురు గిరిజనులు కొట్టుకుపోయిన ప్రాణాలు పోగొట్టుకున్న, సందర్భాలు ఎన్నో ఉన్నాయని స్థానికులు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణ పనుల నత్త నడకన సాగడంతో నిర్మాణ పనులు ఏనాటికి పూర్తవునో మా కష్టాలు తీరేది ఏనాటికో అని పలువురు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బ్రిడ్జి శరవేగంగా నిర్మించి గిరిజనుల రహదారి కష్టాలు తీర్చాలని పలువురు కోరారు

శిథిలావస్థలో కల్వర్టు

దెబ్బతిన్న కల్వర్టు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని సంతారి పంచాయతీ చిన్న బూరుగుపుట్టు గ్రామ సమీపంలో వంతెన కల్వర్టు శిథిలావస్థకు చేరింది. సంతారి ఉప్ప ప్రధాన రహదారి కావడంతో భయాందోళనతో వాహన దారులు ప్రయాణాలు సాగిస్తున్నారు. 2013, 14 సంవత్సరంలో వంతెన కొట్టుకు పోయింది. 2016 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం కల్వర్టు నిర్మాణానికి నిధులు కేటాయించారు. ఆ తర్వాత ఎవరు స్పందించ లేదు.ప్రస్తుత ప్రభుత్వం ఈ వంతెన శిథిలవస్థకు చేరినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు.ప్రధాన రహదారి కావడంతో రెండు మండలాల వాసులు 20 గ్రామ పంచాయతీ ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

నూతన తయారీ పరిజ్ఞానంపై 'గీతం'లో వర్క్‌షాప్

డాక్టర్ రవికుమార్‌కు గీతం ప్రతినిధుల సత్కారం

ప్రజాశక్తి- మధురవాడ : పారిశ్రామిక రంగంలో నూతన తయారీ పరిజ్ఞానంపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం వర్క్‌షాప్‌ను నిర్వహించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ వి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐఐటి ఢిల్లీ మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ డి.రవికుమార్ పాల్గొని, డిజిటల్ షీట్ మెటల్ ఫోమింగ్ టెక్నాలజీపై వివరించారు. ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ సిఇఒ.బలివాడ సంతోష్ కుమార్ వైద్య ఉపకరణాల తయారీలో ఎడిటివ్ మ్యాన్ ఫ్యాక్చరింగ్‌పై అనుసరిస్తున్న వినూత్న పరిజ్ఞానాన్ని తెలిపారు. నగరంలోని వివిధ కళాశాలల నుంచి ఇంజనీరింగ్ అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమానికి కోఆర్డినేటర్లుగా డాక్టర్ ఆర్.భానుపవన్, జె.సింహాద్రి రాజు వ్యవహరించారు.

నియామక పత్రం అందజేస్తున్న కేంద్ర మంత్రి భగవంత్ ఖూబా

ఘనంగా రోజ్ ఘర్ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల భర్తీకి చేపట్టిన రోజ్ ఘర్ మేళా ఎనిమిదో విడత కార్యక్రమం నగరంలోని సాగరమాల కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా కేంద్ర రసాయనాలు, ఎరువులు శాఖ మంత్రి భగవంత్ ఖూబా హాజరయ్యారు. నూతనంగా ఉద్యోగాలకు ఎంపికైన 293 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అక్టోబర్ నుంచి ఇప్పటి వరకూ సుమారు పది లక్షల మందికి నియామకాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో బిజెపి రాజ్యసభ ఎంపీ జివిఎల్.నరసింహారావు, సిఐఎస్ఎఫ్ డిఐజి ఎం.నందన్, సిఐఎస్ఎఫ్ కమాండెంట్లు మహమ్మద్ హనీఫ్, సతీష్ కుమార్, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ కార్యదర్శి టి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

కుటుంబ కథా చిత్రం 'మిస్ శెట్టి - మిస్టర్ పొలిశెట్టి'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మిస్ శెట్టి - మిస్టర్ పొలిశెట్టి సినిమా బృందం సోమవారం విశాఖలో సందడి చేసింది. ఈ సినిమా సెప్టెంబర్ 7న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల కానుందని నిర్వాహకులు తెలిపారు. ఆ సినిమా ప్రమోషన్‌లో భాగంగా వారు విశాఖ చేరుకున్నారు. అనంతరం చిత్ర బృందం హోటల్ గ్రీన్ పార్క్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హీరో నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ జాతిరత్నాలు సినిమా తరువాత మళ్ళీ విశాఖ వచ్చానని అన్నారు. మిస్ శెట్టి - మిస్టర్ పొలిశెట్టి కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమని తెలిపారు. చిత్ర దర్శకుడు, రచయిత పి.మహేష్ బాబు, హీరోయిన్ అనుష్క తదితరులు పాల్గొన్నారు.

వ్యవహారిక భాషోద్యమానికి ఊతం గిడుగు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వ్యవహారిక భాషోద్యమానికి ఊతం గిడుగు రామ్మూర్తి పంతులని పలువురు వక్తలు అన్నారు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్, తెలుగు విభాగం ఆధ్వర్యంలో కళా ప్రపూర్ణ గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్న తరుణంలో 'గిడుగు రామ్మూర్తి జీవితం, రచనలు - సమాలోచన' అనే అంశంపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఎయు తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య జి.యోహాన్ బాబు, ఆచార్య వెలమల సిమ్మన్న, డాక్టర్ బూసి వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉల్లాసం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం పెరుగుతుందని విశాఖపట్నం పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ జె.ప్రసాద్ బాబు పేర్కొన్నారు. జాతీయ క్రీడా వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ ఆదేశాల మేరకు విశాఖపట్నం పోస్టల్ డివిజన్, ఆర్ఎంఎస్, పోస్టల్ రీజినల్ ఆఫీస్ ఉద్యోగులు సోమవారం 5కె నడక చేపట్టారు. వుడా పార్క్ నుంచి ఆర్‌కె.బీచ్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహం వరకూ.. తిరిగి వుడా పార్క్ వరకూ ఈ కార్యక్రమం సాగింది.

ఆర్‌టిసి ఉద్యోగులకు త్వరలో అలవెన్సుల చెల్లింపు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆర్‌టిసి ఉద్యోగులకు ఓవర్ టైం (ఓటి), నైట్ అవుట్ అలవెన్సులను జీతంతో పాటు త్వరలో చెల్లిస్తారని ఆర్‌టిసి ఇయు రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు తెలిపారు. సంఘం విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల విస్తృత స్థాయి సమావేశం అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో సోమవారం జరిగింది.

నిర్మాణ లోపంతోనే కూలిన బస్ బే

కూలిన బస్ బే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సెంట్రల్ పార్కు ఎదురుగా ఆర్‌టిసి కాంప్లెక్స్ దక్షిణం వైపున నిర్మించిన బస్ బే ప్రారంభానికి ముందే కూలిపోవడానికి నిర్మాణ లోపాలే కారణమని వామపక్ష పార్టీల నేతలు అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, తదితరులు కూలిపోయిన బస్సు బే ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర వ్యాపితంగా జివిఎంసి నిధుల నుంచి రూ.4 కోట్లా 62 లక్షలు ఖర్చు పెట్టి, ప్రచారార్భాటాలతో కట్టిన బస్ బేల్లో అవినీతి చోటుచేసుకుందన్నారు. బస్ బే కూలిపోవడానికిగల కారణాలపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు వై.కొండయ్య, దేవా, ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎస్‌కె.రెహమాన్, ఎం.సుబ్బారావు, కె.సత్యనారాయణ, పి.కృష్ణారావు, ఆర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యాన నిరసన

ప్రజాధనాన్ని వైసిపి ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. సెంట్రల్ పార్క్ ఎదురుగా ఆదివారం కూలిపోయిన బస్ బే వద్ద సోమవారం సాయంత్రం టిడిపి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ దక్షిణ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, భీమిలి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, ఉత్తర ఇన్‌ఛార్జి చిక్కాల విజయ్ బాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పుచ్చా విజయ్ కుమార్, రాజమండ్రి నారాయణ, విల్లూరి చక్రవర్తి పాల్గొన్నారు.

తాటిపూడి- సీతంపేట రోడ్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విజయనగరం జిల్లా తాటిపూడి రిజర్వాయర్ నుంచి సీతంపేట, తాటిపూడి కాలనీ వరకూ ఉన్న తొమ్మిది కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో 20 గ్రామాల ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, జివిఎంసి పరిధిలో ఈ రోడ్డు ఉన్నందున తక్షణం ఈ రోడ్డును జివిఎంసి వారు పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎపి రైతు సంఘం విజయనగరం జిల్లా కమిటీ ఆధ్వర్యాన బాధిత గ్రామాల రైతులు, ప్రజలు ధర్నా నిర్వహించారు. సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, ఎపి రైతు సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షులు బుద్ధరాజు రాంబాబు నాయకత్వంలో అక్కడ నుంచి ర్యాలీగా జివిఎంసి ప్రధాన కార్యాలయానికి వెళ్లి స్పందనలో కమిషనర్‌కు, మేయర్‌కు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ విశాఖపట్నం నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం 50 ఏళ్ల క్రితం తాటిపూడి రిజర్వాయర్‌ను నిర్మించారన్నారు. అక్కడ నుంచి విశాఖ నగరం వరకు పైపులైను ఏర్పాటు చేశారని, ఇందుకు అవసరమైన భూములను ఈ ప్రాంతంలోని ఎస్.కోట, గంట్యాడ మండలాలకు చెందిన మధుపాడ, ముసిడిపల్లి, చినకండిపల్లి, విశ్వనాథపురం, భీమవరం, కృష్ణాపురం గ్రామాల నుంచి సేకరించారని చెప్పారు. ఆ సమయంలో జివిఎంసి వారు సీతంపేట నుంచి తాటిపూడి కాలనీ వరకు 9 కిలోమీటర్లు పొడవున తారు రోడ్డు నిర్మించారని చెప్పారు. అది ఆయా గ్రామాల ప్రజలందరికీ ఎంతో ఉపయోగంగా ఉండేదన్నారు. ఆ రోడ్డు ఇప్పుడు శిథిలావస్థకు చేరిందని తెలిపారు. కార్యక్రమంలో ఆయకట్టు ప్రాంత రైతులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కెఎ.పాల్ దీక్ష

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న కెఎ.పాల్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయకుండా ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలంటూ ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ.పాల్ ఆశీలుమెట్టలోని కెఎ.పాల్ ఫంక్షన్ హాలు ప్రాంగణంలో సోమవారం సాయంత్రం ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ప్రయత్నాలను నిలిపివేస్తామని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉక్కు త్యాగాలను పక్కనపెట్టి కేంద్రం ప్రయివేటీకరణకు ముందుకెళ్లడం సరికాదన్నారు. లక్షల కోట్ల విలువైన భూములు కలిగిన ప్లాంటును తక్కువ ధరకే అదానీకి విక్రయించడానికి ప్రయత్నిస్తున్న ప్రధాని మోడీ చర్యలను ప్రజలు వ్యతిరేకించాలన్నారు. గుజరాత్ రౌడీలతోనే దేశం వినాశనమవుతుందని ప్రజలు గ్రహించాలని, క్విట్ మోడీని దేశ ప్రజలు అమలు చేయాలని అన్నారు. ప్రయివేటీకరణ నిలిపివేస్తున్నట్లు ప్రకటన చేసేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తానన్నారు. పాల్‌కు మద్దతుగా 30 మంది శిబిరంలో కూర్చున్నారు.

కరుణాకరరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న గురుమూర్తిరెడ్డి తదితరులు

జాతీయ స్థాయిలో ఒసి కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జాతీయ స్థాయిలో ఒసి కార్పొరేషన్ ఏర్పాటుకు తాను కృషి చేస్తానని ఒసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జి.కరుణాకర రెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని ఓ హోటల్‌లో కరుణాకరరెడ్డి జన్మదిన వేడుకలను ఒసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రెడ్డి, కమ్మ, వైశ్య, బ్రాహ్మణ, కాపు తదితర అగ్రకులాల్లోని పేదల అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, రెడ్డి జెఎసి నాయకులు సత్యనారాయణ రెడ్డి, బాల బ్రహ్మారెడ్డి, శివ కుమార్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

జివిఎంసి క్రికెట్ జట్టు అద్భుత విజయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జింక్ మైదానంలో జివిఎంసి, ఇన్‌కమ్ ట్యాక్స్ జట్ల మధ్య సోమవారం జరిగిన విడిసిఎ ఇనిస్టిట్యూషన్స్ పూల్ సి మ్యాచ్‌లో జివిఎంసి జట్టు 157 పరుగుల భారీ విజయం సాధించింది. మొదటగా బ్యాటింగ్ చేసిన జివిఎంసి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 3 వికెట్లు మాత్రమే నష్టపోయి 196 పరుగుల భారీ స్కోరు చేసింది. ఆ జట్టులో ప్రశాంత్ 102, నరేష్ 22, రామ్ సతీష్ 21 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన ఇన్‌కమ్ ట్యాక్స్ జట్టు 12.5 ఓవర్లలో కేవలం 39 పరుగులు మాత్రమే చేసి ఆలౌటయ్యింది. జివిఎంసి తరపున సుబ్రమణ్యాం 4, కెప్టెన్ శివ 2, త్రినాథ్ 2 వికెట్లు తీసి విజయంలో ముఖ్య భూమిక వహించారు. జివిఎంసి జట్టును, ముఖ్యంగా సెంచరీ సాధించిన ప్రశాంత్‌ను జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, టీమ్ మేనేజర్ సన్నీ అభినందించారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని కొనసాగించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దళిత విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించడానికి దోహదపడుతున్న బెస్ట్ అవైలబుల్ స్కూలు పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని దళిత హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చింతాడ జోగారావు కోరారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఆయన నిరసన తెలిపారు. స్పందనలో వినతి పత్రం సమర్పించారు.

ఆర్‌జి క్రియేషన్స్ బ్యానర్‌లో త్వరలో సినిమా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆర్‌జి క్రియేషన్స్ బ్యానర్‌పై త్వరలో లవ్, కామెడీ, ఎంటర్ టైనర్ సినిమాను, కొత్త నటీనటులతో నిర్మిస్తున్నట్లు దర్శకుడు రాము గుడివాడ తెలిపారు. సోమవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్‌జి క్రియేషన్స్ ప్రొడక్షన్ నెంబర్ -1 బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నగరానికి చెందిన నటుడు రవితేజతో పాటు అందరూ కొత్త నటీనటులు ఈ చిత్రంలో ఉంటారన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో సోమవారం ఆర్‌టిసి కాంప్లెక్స్ అవుట్ గేట్ నుంచి గురజాడ జంక్షన్ మీదుగా వందలాది మందితో జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కె.మల్లయ్య, ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మి, మురికివాడల నివాసుల సంఘం కార్యదర్శి ఇ.లక్ష్మి, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.లక్ష్మి, అరుణోదయ మహిళా సంఘం కార్యదర్శి కె.నిర్మల పాల్గొన్నారు.